## కథ

రాత్రి పదిగంటలు దాటింది.
‘క్లినిక్’లో పేషెంట్లందరూ వెళ్లిపోయాక, డాక్టర్ రాధాకృష్ణ వుండే ‘కన్సల్టింగ్ రూం’లోకి వచ్చాడు అటెండర్ పైడిరాజు.
‘‘ఇంక పేషెంట్లెవ్వరూ లేరు సార్!’’ చేతులు కట్టుకొని వినయంగా చెప్పాడు.
‘‘అమ్మగారు రెడీయేనా’’ బల్ల మీద వున్న బ్రీఫ్‌కేసు సర్దుకొని కుర్చీలోంచి లేస్తూ అడిగాడు రాధాకృష్ణ.
‘‘రెడీగానే వున్నారు సార్! కార్లో, మీకోసం వెయిట్ చేస్తున్నారు’’ చెప్పాడు. రాధాకృష్ణ కార్లో భార్య మీనా పక్కన కూర్చున్నాడు. మరో రెండు నిమిషాలకు క్లినిక్ షట్టరు దించేసి, తాళం వేసి వచ్చి పైడిరాజు కూడా కార్లో ఎక్కాడు.
కారు బయల్దేరింది. అప్పటికి ట్రాఫిక్ బాగా తగ్గిపోవడంతో, విశాలంగా ఉన్న రోడ్డు మీద కారు వేగంగా వెడుతోంది. కార్లో ఏసి ఆన్ చేయడం వల్ల బాగా చల్లగా వుంది.





# అమ్మలేని పుట్టిల్లు

**జీడిగుంట రామచంద్రమూర్తి**

పైడిరాజు ప్రాణానికి ఎంతో హాయిగా వుంది. ‘వాహన యోగం’ అంటే ఇదే కాబోలు అనుకుని, తనలో తనే నవ్వుకున్నాడు. తొందర్లోనే అమ్మను కూడా ఇక్కడికి తీసుకొచ్చి, ఈ కార్లో ఒక్కసారైనా ఎక్కించి తిప్పితే ఎంత సంతోషిస్తుందో! అనుకున్నాడు.

‘‘మా దగ్గర పనిచేయడం నీకు ఎలా వుందోయ్?’’ దారిలో అడిగాడు రాధాకృష్ణ.

ఆ ప్రశ్న వినగానే- అతనివైపు ముందు కృతజ్ఞతగా చూసి, తర్వాత చెప్పాడు పైడిరాజు.

‘బావుంది సార్! ఇంతకు ముందు నేను హోటల్లో పదిగంటలు డ్యూటీ చేసేవాడిని. ఇక్కడైతే సాయంత్రం ఒక్కపూటే కదా! పైగా తినడానికి అన్నం పెడుతున్నారు. ఉండడానికి గది ఇచ్చారు. అమ్మకి చెప్తే చాలా సంతోషిస్తుంది.’

‘‘మరి మీ వాళ్లకు ఫోన్ చేసి చెప్పలేకపోయావా?’’ అడిగింది మీనా.

‘‘అక్కడ మాకు ఫోన్ లేదు మేడం! అయినా, నేను పదోక్లాసు పాసై, మా ఊరెళ్లి మా అమ్మనీ, నాన్ననీ, సర్‌ప్రయిజ్ చేయాలి! అప్పటి దాకా

అస్సలు ఉత్తరం కూడా రాయను.'' దృఢమైన స్వరంతో అన్నాడు పైడిరాజు.

''పొద్దున్న సమయాల్లో నీకు అంతా ఖాళీయే కదా. పుస్తకాలు కొనుక్కుని చదువుకో'' సలహా ఇస్తున్నట్లు చెప్పాడు రాధాకృష్ణ.

మరో అయిదు నిమిషాలకు జూబ్లీహిల్స్‌లో వాళ్లింటి ముందు కారు ఆగింది. కార్లో వున్న బ్రీఫ్ కేస్ తీసుకెళ్లి హాల్లో టీపాయ్ మీద పెట్టాడు పైడిరాజు. అప్పటికే డైనింగ్ టేబుల్ మీద 'హాట్‌ప్యాక్, ప్లేట్లూ' అన్నీ సర్దిపెట్టి వంటమనిషి వెళ్లిపోయింది.

రాధాకృష్ణ, మీనా బట్టలు మార్చుకొని డైనింగ్ టేబుల్ ముందు కూర్చున్నారు. వాళ్లకు కావలసినవన్నీ సమకూర్చి తను కూడా భోజనం చేసి, ఆ ఇంటి వెనుక భాగంలో వున్న తన గది వైపు నడిచాడు పైడిరాజు.

''రేపొద్దున్న పదింటికి, మనం బయటకు వెళ్లాలి. రెడీగా వుండు'' వెళ్లిపోతున్న పైడిరాజుకి వినిపించేలా చెప్పాడు రాధాకృష్ణ.

మీనా గైనకాలజిస్టుగానూ, రాధాకృష్ణ కార్డియాలజిస్టుగానూ నగరంలోని ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో పనిచేస్తున్నారు. పొద్దున్న ఎనిమిదింటికి వెళ్లి సాయంత్రం మూడింటికి వస్తారు. మళ్లీ అయిదు నుంచి రాత్రి పదయ్యేదాకా ఇద్దరూ క్లినిక్‌లో పేషెంట్లను చూస్తారు. ఇద్దరికీ కన్సల్టింగ్ గదులు వేరు వేరుగా వున్నాయి. వాళ్ల దగ్గర, పైడి రాజు అటెండర్‌గా చేరి అయిదురోజులే అయింది. ఇంతకు ముందు మూడు నెలల పాటు, అతను సికింద్రాబాద్ స్టేషన్ దగ్గరున్న ఇరానీ హోటల్లో పనిచేశాడు.

పైడిరాజుది శ్రీకాకుళం దగ్గర ఓ చిన్న పల్లెటూరు. అతని తండ్రి అప్పలకొండ ఆటో డ్రైవర్. పగలంతా టౌన్లో ఆటో నడిపి, రాత్రి డ్యూటీ దిగిన తర్వాత సరాసరి సారా దుకాణానికి వెళ్లి, ఆనాటి సంపాదనలో సగానికి పైగా తాగేసేవాడు. ఆ మైకంలో ఇంటికొచ్చి, అయిందానికీ, కాని దానికీ పెళ్లాన్ని చితక బాదేవాడు. అడ్డం వచ్చే పైడిరాజుని అవతలకు తోసి పారేసేవాడు. ఒకవైపు దెబ్బలు తిన్న బాధను ఓర్చుకుంటూనే, మరో వైపు కొడుకును దగ్గరకు తీసుకొని ఓదార్చేదామె.

''ఒరే పైడీ! మీ నాయనలాగా నువ్వూ ఖాకీ గుడ్డలేసుకొని ఆటో డ్రైవర్‌లాగా బతక్కూడదురా! బాగా సదువుకొని, దొరబాబులాగా ఏ గవర్నమెంటు ఆఫీసులోనో చేరి పెద్ద ఉద్యోగం చెయ్యాల!'' అంటూండేది. అతని కోసం ఆమె ఎంతో కష్టపడేది. అప్పుడప్పుడు పొలాల్లో కూలి పనికెళ్లి, అంతో ఇంతో సంపాదించుకొచ్చి దాన్ని పైడిరాజు పుస్తకాలకీ, బట్టలకీ ఖర్చుపెట్టేది. తాను అర్ధాకలితో సరిపెట్టుకున్నా-కొడుక్కి మాత్రం కడుపునిండా అన్నం పెట్టేది. తల్లి కష్టానికి తగిన ఫలితాన్నివ్వాలని పైడిరాజు తహతహలాడేవాడు. రాత్రింబవళ్లూ కష్టపడి చదివాడు. కానీ ప్రయోజనం లేకపోయింది. లెక్కల పేపరల్లో తక్కువ మార్కులు రావడంతో పదోక్లాసు ఫెయిలయ్యాడు.

''చదివింది చాలు కానీ-నాతో కూడా వుండి ఆటో తిప్పడం నేర్చుకో'' అన్నాడు తండ్రి. 'ససేమిరా వీల్లేదంది' తల్లి. ఇద్దరి మధ్యా పెద్ద ఘర్షణ జరిగింది. అప్పుడు కూడా తండ్రి ఆమెను కొట్టాడు. పైడిరాజుకి ఏడుపొచ్చింది. పౌరుషమూ వచ్చింది. మళ్లీ ఆ పరీక్ష రాసాడు. మొదటిసారి కంటే, మరిన్ని తక్కువ మార్కులు వచ్చి మళ్లీ ఫెయిలయ్యాడు. తన కారణంగా తల్లి మళ్లీ తండ్రి చేతిలో దెబ్బలు తినకూడదనుకున్నాడు. ఏదో ఒక పని చేసుకుంటూ, తన కాళ్లపై తాను నిలబడి, ప్రయివేటుగా చదివి ప్రయోజకుడై అప్పుడే తన వాళ్లకు కనిపించాలన్న లక్ష్యంతో ఇంట్లో వాళ్లకు చెప్పకుండా, రాత్రికి రాత్రి ఓ లారీ ఎక్కి, హైదరాబాదు వచ్చేశాడు. అదృష్టవశాత్తు, రాగానే హోటల్లో పని దొరికింది. కానీ చదువుకునేందుకు సమయం చిక్కేది కాదు. వారం రోజుల క్రితం ఓ రాత్రివేళ కాస్తంత సమయం దొరికితే, హోటల్లో బల్ల మీదున్న పేపరు చదువుదామని తీసుకున్నాడు. అప్పుడే అతని దృష్టి, యథాలాపంగా అందులో వచ్చిన ఓ ప్రకటనపై పడింది.

'మసాబ్‌టాంక్ సమీపంలో వున్న ఓ క్లినిక్‌లో అటెండరుగా పనిచేయడానికి పదోతరగతి పాసైన అబ్బాయి కావాలని, వసతి, భోజనంతో పాటు, నెలకు మూడువేల జీతం ఇవ్వబడుతుందని, ఆసక్తి గలవారు మర్నాడు సాయంత్రం క్లినిక్‌లో డాక్టరు గార్ని స్వయంగా కలుసుకోవాలన్నది' ఆ ప్రకటన సారాంశం. దాన్ని చదవగానే 'ఆ ఉద్యోగం' తనకు దొరికితే బాగుండుననుకున్నాడు పైడిరాజు. తను పదోక్లాసు పాసవ్వలేదన్నమాటే గాని చదివాడు! అంతో ఇంతో లోకజ్ఞానం సంపాదించుకున్నాడు. ఆ డాక్టరుగారికి తన పరిస్థితి వివరించి ప్రాధేయపడితే తనను ఉద్యోగంలోకి తీసుకోవచ్చు. అప్పుడు చదువుకునేందుకు కాస్తంత సమయం దొరుకుతుంది. ప్రయివేట్‌గా మళ్లీ చదుకోవచ్చు. అమ్మ మెప్పు పొందవచ్చు. ఆ ఉద్యోగం పైడిరాజునే వరించింది. ఆ మర్నాడే క్లినిక్‌లో అటెండరుగా చేరిపోయాడు. అతని మకాం డాక్టర్ రాధాకృష్ణ ఇంటి వెనుక భాగంలో వున్న గదికి మారిపోయింది.

* * *

ఆరోజ ఆదివారం!

'పదిగంటలకు బైటికి వెళ్లాలి. సిద్ధంగా వుండమంటూ' అంతకు ముందు రాత్రి రాధాకృష్ణ చెప్పిన విషయం గుర్తుపెట్టుకొని ఉదయాన్నే లేచి తొమ్మిందిటికల్లా తయారై తన గదిలోంచి బయటకొచ్చాడు పైడిరాజు.

పోర్టికోలో కారు తుడుస్తున్న డ్రైవరు కనిపించాడు.

'ఆదివారం నీకు శలవుండదా భయ్యా!' అడిగాడు అతన్ని చేరుకొని.


''ఇదేమన్నా గవర్నమెంటు జాబా? శలవలుండడానికి? ఎప్పుడైనా అవసరం వచ్చి అడిగితే శలవిస్తార్లే. అయినా ఆదివారాల్లో పొద్దున్నపూట తప్పనిసరిగా రావాలి!'' చెప్పాడతను.

అప్పుడే లోపల్నించి వంటమనిషి వాళ్లిద్దరికీ 'చాయ్' తెచ్చి ఇచ్చింది. పక్కనే వున్న అరుగు మీద కూర్చుని చాయ్ తాగుతూ ఇద్దరూ కబుర్లలో పడ్డారు.

''నేనిక్కడ చేరిన అయిదురోజుల్నించీ చూస్తున్నా! ఇంట్లో అయ్యగారూ, అమ్మగారూ తప్ప ఇంకెవరూ కనిపించడంలేదు. పిల్లలు లేరా?'' సందేహిస్తూనే అడిగాడు పైడిరాజు.

''ఉన్నాడు! ఒక్కడే బాబు! ఊటీలో హాస్టల్‌లో వుండి చదువుకుంటున్నాడు ఆరో క్లాసు. అప్పుడప్పుడు శలవులకు వస్తుంటాడు. తీరిక దొరికినప్పుడు అమ్మగారోసారీ, అయ్యగారోసారీ వెళ్లి చూసొస్తుంటార్లే!'' చెప్పాడు డ్రైవరు. పైడిరాజు వింతగా చూసాడు.

హైదరాబాద్ మహానగరంలో ఎన్నో పెద్ద పెద్ద స్కూళ్లుండగా, వాటిలో ఎక్కడా చదివించకుండా, అంత చిన్న వయస్సులో వున్న పిల్లవాడిని ఎక్కడో దూరంగా వుంచి చదివించడం ఎందుకో అతనికి అర్థం కాలేదు.



ఆ విషయమే అడగాలనుకుంటూండగా డ్రైవరే మళ్లీ చెప్పాడు.

''అమ్మగారూ, అయ్యగారూ ఎప్పుడే బిజీ కదా! పిల్లాడు ఎలా చదువుతున్నాడో చూసుకోవడం కష్టమవుతుందని అక్కడ చేర్పించారు. అక్కడైతే అన్నీ హాస్టల్ వాళ్లే సమకూరుస్తారట. క్రమశిక్షణగా వుండడం నేర్పుతారు. చదువు చాలా బాగా చెప్తారట. చిన్నప్పుడు డాక్టరుగారూ కూడా అక్కడే చదువుకున్నారు!''

అతని మాటలు వింటూ పైడిరాజు ఆలోచిస్తూ వుండిపోయాడు.

''ఇంజనీరింగో, మెడిసినో చదివించడానికి దూరాభారాలు పంపినా అర్థం వుంటుంది. ఎంత తీరికలేని డాక్టర్లయితే మాత్రం వున్న ఒక్కగానొక్క కొడుకునీ, అదీ అంత చిన్నవయసు వాడినీ కావాలని దూరం చేసుకున్నారా?''అనుకున్నాడు.

''నీకో విషయం చెప్పనా బ్రదర్?'' చాయ్ తాగడం పూర్తిచేసి గ్లాసు పక్కన పెడుతూ అన్నాడు డ్రైవరు.

పైడిరాజు ఆసక్తిగా అతని వైపు చూశాడు.

''గొప్ప వాళ్లింట్లో పిల్లల పెంపకం అలాగే ఉంటుంది. నా సర్వీసులో ఇలాంటి కుటుంబాల్ని చాలానే చూశాను. డబ్బునీ, హోదానీ ప్రేమించి నంతగా వాళ్లు పిల్లల్ని ప్రేమించరు. అదే పేదవాళ్లయితే- తమ పిల్లలకు ఆస్తిపాస్తులు ఇవ్వకపోయినా, చదువు సంధ్యలు నేర్పించలేక పోయినా-ప్రేమానురాగాన్ని పంచుతారు!'' చెప్పాడతను.

ఆ మాటలు పైడిరాజు మనస్సులో సూటిగా నాటుకున్నాయి. ఆ క్షణాన అతనికి అమ్మ గుర్తుకొచ్చి మనసు బాధగా మూలిగింది.

అమ్మకు తనంటే ఎంతో ప్రాణం. డాక్టరుగారి భార్య ఊటీలో వుంటున్న తన కొడుకును ఈ అయిదురోజుల్లో ఒక్కసారైనా తలుచుకోవడం తను చూడలేదు. కానీ తనను మాత్రం తన తల్లి ప్రతి రోజూ, ప్రతి పూటా తల్చుకుంటూనే వుండాలి! ఏమైపోయాడో బిడ్డ! అనుకుంటూ ప్రతి నిమిషమం తల్లడిల్లుతూండాలి. అందుకే కావచ్చు తాను మంచినీళ్లు తాగేటప్పుడు, అన్నం తినేటప్పుడూ, అనేకసార్లు పొలమారింది. అమ్మను గురించిన ఆలోచనలు మదిలో మెదలగానే, అతని గొంతులోకి దుఃఖం పొర్లుకొచ్చింది. తెలియకుండానే కన్నీళ్లు చెంపల మీదకు జారాయి. వాటిని డ్రైవరు చూడకుండా తుడుచుకున్నాడు పైడిరాజు.

అంతలో వంటమనిషి క్యారియర్ తీసుకొచ్చి డ్రైవర్‌కి అందిస్తూ 'అయ్యగారు వస్తున్నారు!' అని చెప్పింది.

దాన్ని జాగ్రత్తగా తీసుకెళ్లి కార్లో పెట్టాడు డ్రైవర్.

''క్యారియర్ దేనికి భయ్యా? హోటల్ నుంచి భోజనం తేవాలా?'' అడిగాడు పైడిరాజు.


''తేవడం కాదు! తీసుకెడుతున్నారు. అక్కడి ఓల్డేజ్ హోంలో డాక్టరుగారి అమ్మగారుంటారు. వారికోసం'' చెప్పాడతను.

పైడిరాజుకి అర్థం కాలేదు.

''అంత పెద్ద బంగళా, అందులో ఓ వంటమనిషీ వుండగా, డాక్టరుగారు, తన తల్లిని ఓల్డేజ్ హోంలో ఎందుకుంచారో?''అనుకున్నాడు.

ఇంతలో డ్రైవర్ మళ్లీ చెప్పాడు.

''రెండేళ్ల క్రితం ఆ అమ్మగారికి పక్షవాతం వచ్చింది. ఇంట్లో వుంటే చూసేవారూ, చేసేవారూ వుండరని అప్పట్నించి అక్కడ వుంచారు. అక్కడ అన్ని సదుపాయలూ వున్నాయిలే! వాళ్లమ్మగారుండే గదిలో ప్రత్యేకించి ఏసి, టీవీ పెట్టించారు. బయటకొచ్చి తిరిగేందుకు వీల్ చైర్ కూడా కొన్నారు. ఆవిడ వయస్సు వాళ్లు అక్కడ ఇంకో అరడజను మంది వున్నారు. వాళ్లతో ఆవిడకు బాగా కాలక్షేపంగా వుంటుంది. ప్రతి ఆదివారం, అయ్యగారూ, అమ్మగారూ అక్కడికి వెళ్లి ఆవిడతో కలిసి భోజనం చేసి కాస్సేపు కబుర్లు చెప్పి వస్తూంటారు.''




'ఎన్ని సౌకర్యాలు కల్పిస్తే మాత్రం సొంత ఇంట్లో వున్న తృప్తి వృద్ధాశ్రమంలో వుంటే కలుగుతుందా?' అనుకున్నాడు పైడిరాజు. ఆమాటే డ్రైవర్‌తో అనాలనుకున్నాడు. అయితే అదే సమయంలో లోపల్నించి రాధాకృష్ణ దంపతులు రావడం గమనించి ఆ ప్రయత్నం మానుకున్నాడు.

''పైడిరాజూ! నువ్వు కూడా రా!'' అంటూ రాధాకృష్ణ కార్లో ఎక్కాడు.

మరికాసేపటికి, హయత్‌నగర్ ప్రాంతంలో వున్న ఓ వృద్ధాశ్రమం ముందు కారు ఆగింది. రాధాకృష్ణ దంపతుల వెనుక క్యారియర్ పట్టుకొని పైడిరాజు కూడా లోపలకు వెళ్లాడు.

అక్కడే ఓ గదిలో రాధాకృష్ణ తల్లి 'వీల్‌ఛైర్లో' కూర్చుని టీవీ చూస్తోంది. కొడుకునీ, కోడల్నీ చూడగానే టీవీ ఆఫ్ చేసి వాళ్లను చేరుకొని ఆప్యాయంగా పలకరించింది. ముందుగా ఆవిడ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్న రాధాకృష్ణ ఆ తర్వాత తమ దగ్గర పనిలో చేరిన పైడిరాజుని ఆవిడకు పరిచయం చేశాడు. ఆవిడ అతని వైపు ఆప్యాయంగా చూసింది. అలా చూస్తూంటే ఆ చూపుల్లో పైడిరాజుకి మళ్లీ తన తల్లి గుర్తుకొచ్చింది.

ఓ రెండు గంటల పాటు ఆశ్రమంలో గడిపి, తల్లి దగ్గర వీడ్కోలు తీసుకొని తిరుగు ప్రయాణమయ్యాడు రాధాకృష్ణ.

అప్పట్నించీ ప్రతి ఆదివారం వాళ్లతో కలిసి పైడిరాజు ఆ వృద్ధాశ్రమానికి వెడుతూనే వున్నాడు. రెండు మూడు సార్లు రాధాకృష్ణకి తీరిక లేకపోతే తానొక్కడే వెళ్లి క్యారియర్ ఇచ్చి, ఆవిడతో కబుర్లు చెప్పి వచ్చేవాడు. ఆ కబుర్లలో ఎక్కువగా కొడుకుపట్ల ఆవిడకున్న వాత్సల్యం వ్యక్తమయ్యేది. తాను కూడా తన తల్లినించి అలాంటి అనురాగాన్ని అందుకోవాలని ఆతృతపడేవాడు.

తను పనిచేస్తున్న క్లినిక్‌కి దగ్గరల్లో వున్న ఓ కోచింగ్ సెంటర్లో చేరి, నెలరోజుల పాటు లెక్కలు చెప్పించుకొని, పరీక్షరాసి, మంచి మార్కులతో పాసయ్యాడు. ఇక అతని ధ్యాస ఇంటి వైపు మళ్లింది. తల్లిని చూడాలన్న ఆరాటం ఎక్కువైంది.

''ఓ సారి మా ఊరు వెళ్లొస్తాను సార్!'' ఓ రోజు రాత్రి క్లినిక్ నుంచి తిరిగివస్తూంటే రాధాకృష్ణను అడిగాడు పైడిరాజు.

అతను అభ్యంతరం చెప్పలేదు.

''అలాగే వెళ్లిరా! మళ్లీ ఆదివారం నాటికి వచ్చేయాలి'' అంటూ జేబులోంచి అయిదువందల నోట్లు తీసి అతనికి ఇచ్చాడు రాధాకృష్ణ.

* * *

తెలతెలవారుతుండగా వాళ్ల ఊళ్లో బస్సు దిగిన పైడిరాజు పరుగులాంటి నడకతో తన ఇంటిముందుకొచ్చి డబడబా తలుపు కొట్టాడు.

''ఎవరదీ?'' అంటూ, ఆవలిస్తూనే వచ్చి తలుపు తీసిన ఆమె మెడ చుట్టూ చేతులు బిగించి 'అమ్మా' అంటూ గాఢంగా కౌగిలించుకున్నాడు పైడిరాజు.

''ఛీ....ఎవడివి నువ్వు?'' అంటూ అతన్ని

విదిలించి కొట్టి దూరంగా జరిగింది. పైడిరాజు ఉలిక్కిపడి చూశాడు. ఆమె తన తల్లి కాదు.

''ఎవరు నువ్వు? ఈ ఇంట్లో మా అమ్మ వుండాలి!'' ఆమె వైపు ఉలికిపాటుతో చూస్తూనే భయమూ, ఆందోళన మిళితమైన గొంతుతో అడిగాడు.

ఆ అలికిడికి మెళకువ వచ్చి, అక్కడికి చేరుకున్న అప్పలకొండ గుమ్మంలో నిలబడి వున్న కొడుకుని చూశాడు.

''వచ్చావురా పైడీ! ఇంతకాలానికి నీకు ఇల్లు గేపకానికి వచ్చిందట్రా...కానీ.. అంతా అయిపోయిందిరా పైడి....!'' కొడుకుని కౌగిలించుకొని ఏడ్చేశాడు.

పైడిరాజుకి తండ్రి మాటలు అర్థం కాలేదు. మనసు కీడును శంకించింది. ఇంతలో అప్పలకొండ చెప్పాడు.

''నీ కోసం బెంగపెట్టుకొని, నిన్నే తలుచుకుంటూ చచ్చిపోయిందిరా మీ అమ్మ! నీ చదువు కోసం, నిన్నో పెద్ద ఉద్యోగస్తుడిలా చూడడం కోసం అది రెక్కలుముక్కలు చేసుకునేదిరా పైడీ! కానీ, నువ్వేం చేశావ్? పరీక్ష ఫెయిలయ్యావ్... మళ్లీ చదివించవచ్చులే అనుకుందిరా! కానీ, నువ్వు చెప్పాపెట్టకుండా ఇల్లొదిలి పారిపోయావ్..!''

నిశ్చేష్టుడై శిలాప్రతిమలా చూస్తూండిపోయాడు పైడిరాజు.

తండ్రి ఇంకా చెప్తున్నాడు.

''నీ మీద దిగులుతూనే అది మంచం పట్టిందిరా...! ఆరు నెలలు అలాగే మంచం మీద జీవచ్ఛవంలా..కళ్లల్లో వత్తులు వేసుకొని ఎదురు చూసింది. నీకోసం పోలీసులు రిపోర్టు ఇచ్చాను. రేడియోలో చెప్పించాను. ఫొటో పేపర్లో వేయించాను. నీ జాడ ఎంతకీ తెలియలేదు. ఆత్మహత్య చేసుకున్నావేమో! అనుకుని, అది అల్లాడిపోయిందిరా! చివరకు నిన్ను తలుచుకుంటూనే కన్ను మూసింది.'' పైమీది తుండుగుడ్డతో కళ్లు తుడుచుకున్నాడు. పైడిరాజుకి మాత్రం ఏడుపు ఆగలేదు. అక్కడ ఒక్క క్షణం కూడా వుండాలని అనిపించలేదు. తండ్రిలోపలకు రమ్మంటున్నా వినిపించుకోకుండా గుమ్మంలోంచి బయటకు వచ్చేశాడు. పక్కింటి వాళ్లు ఎదురై పరామర్శించారు. అతని తల్లి ఎలా చనిపోయిందీ మళ్లీ మళ్లీ చెప్పారు. మగాడికి ఆడదాని తోడు అవసరం కనుక, ఊళ్లో వారెవరో అప్పలకొండను ఒప్పించి, ఈ మధ్యనే మళ్లీ మరో ఆడమనిషిని తెచ్చి పెళ్లి చేసినట్లు కూడా చెప్పారు. అంతలో ఆమెకూడా బయటకొచ్చింది.

''ఇంట్లోకి రా పైడిరాజూ! నిన్ను నా కొడుకులాగా చూసుకుంటాను''అంటూ అతని చేయి పట్టుకొని...

కానీ ఆమెలో పైడిరాజుకి 'అమ్మ' కనిపించలేదు. ఇక అక్కడ వుండలేక తిరుగుబస్సులో హైదరాబాద్ వచ్చేశాడు.

## బుల్లి గుర్రం



తంబెలినా అనే ఈ గుర్రం రేసులు గెలవడం, పోలో ఆడటం మాట అటుంచితే, కనీసం ఒక బకెట్టు మీంచి కూడా దూకలేదు. అయినా దీనికా దిగులేం లేదు. మరి అన్ని గుర్రాలూ గిన్నిస్‌బుక్ ఎక్కలేవు కదా! ఇది మాత్రం 2006లో తన అయిదేళ్ళ వయస్సులోనే అతి చిన్న గుర్రంగా గిన్నిస్‌బుక్‌లో చోటు సంపాదించేసింది. ఈ మరుగుజ్జు గుర్రం బరువు 60 పౌండ్లు, ఎత్తు 17 అంగుళాలు మాత్రమే.

* * *

ఆదివారం నాటికి తిరిగి వస్తానంటూ వెళ్లిన పైడిరాజు రెండు రోజుల ముందే రావడం చూసి, ''అప్పుడే వచ్చేశావేం?'' అని అడిగాడు రాధాకృష్ణ.

''మా అమ్మ.. అక్కడ మా అమ్మ లేదు సార్... చచ్చిపోయింది.'' తన్నుకొస్తున్న దుఃఖాన్ని ఆపుకునే ప్రయత్నం చేస్తూ చెప్పాడు పైడిరాజు.

జరిగిన సంగతంతా తెలుసుకున్న రాధాకృష్ణ ''మీ నాన్న కోసమైనా నాలుగురోజులుండి రావల్సింది!'' అన్నాడు.

''అమ్మ వుంటేనే నాన్నకి గౌరవం వుంటుంది సార్. మా అమ్మ లేని ఆ ఇల్లు నాకు మా ఊరి పొలిమేరల్లో వున్న పాడుబడ్డ గుడిలా కనిపించింది. దేవుడు లేని గుళ్లో పూజారి వుండి ఏం ప్రయోజనం సార్'' కన్నీళ్లతో చూస్తూ అడిగాడు పైడిరాజు.

రాధాకృష్ణ విస్మయంగా చూశాడు. చిన్న వయస్సులో వున్న పైడిరాజు పెద్ద వేదాంతిలా కనిపించాడు.

''నేను చెప్పేది నిజం సార్! అమ్మలేకపోతే అసలు కుటుంబం అనే మాటకు అర్థం వుండదుట. దేవుడిని పూజించకపోయినా-అమ్మని ప్రేమిస్తే చాలు బోలెడు పుణ్యం వస్తుందట... మా మేష్టారు చెప్పారు..''

రాధాకృష్ణ అతని వైపు జాలిగా చూస్తూ వింటున్నాడు.

''ఇంక మా అమ్మ లేదుగా. ఎప్పుడూ మా ఊరు వెళ్లనక్కర్లేదు. నేను చదువుకోకపోయినా నష్టం లేదు. మీ దగ్గరే వుంటాను. మీ అమ్మగారిలో మా అమ్మను చూసుకొంటాను'' రెండు చేతులు జోడించి రాధాకృష్ణకు నమస్కరించాడు పైడిరాజు.

* * *

మళ్లీ ఆదివారం వచ్చేసింది.

పదిగంటలకు ముందే రెడీ అయి, తన గదిలోంచి బయటకు వచ్చాడు పైడిరాజు. అప్పటికే కారు తుడిచి, రాధాకృష్ణ దంపతుల కోసం ఎదురు చూస్తున్నాడు డ్రైవరు. మరో పది నిమిషాలకు వాళ్లు రానే వచ్చారు. కానీ వంట మనిషి క్యారియర్ మాత్రం ఇంకా తీసుకురాలేదు.

''స్టార్ట్ చెయ్! బయల్దేరుదాం!'' కారెక్కి కూర్చుని డ్రైవర్‌కు చెప్పాడు రాధాకృష్ణ.

''క్యారియర్ ఇంకా రాలేదు సార్!'' అక్కడే నిలబడి వున్న పైడిరాజు అన్నాడు.

''ఇవాళ క్యారియర్ అవసరం లేదు. ఇదిగో! ఈ ఫ్లవర్ బొకే తీసుకెడుతున్నాం!'' చేతిలో వున్న గులాబీ పూల గుత్తిని చూపించాడు రాధాకృష్ణ.

అర్థం కానట్లు చూశాడు పైడిరాజు.

''దీన్ని మా అమ్మకు అందించి ఇంటికి తీసుకొచ్చేస్తున్నాం పైడిరాజూ! ఇక నుంచీ మా అమ్మ నా గుడిలోనే వుంటుంది. నేను పూజారినై ఆవిడని సేవించుకుంటాను'' అతని భుజం మీద చేయి వేసి మెరిసే కళ్లతో చూస్తూ చెప్పాడు రాధాకృష్ణ.

ఆ మాటలు విన్న పైడిరాజు కళ్లల్లోకి ఒక్కసారిగా నీళ్లు చిమ్మాయి. తన తల్లి మళ్లీ బతికి వస్తోందనుకున్నాడు.

★